క్లుప్తంగా

విజయ డెయిరీ డైరెక్టర్ మృతి


ఇసనాక సునీల్ కుమార్‌రెడ్డి(ఫైల్)

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌కుమార్‌రెడ్డి(54) అనారోగ్యంతో నెల్లూరులోని అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. ఆయన పార్టీ ఆవిర్భావం నుంచి చురుకైన నాయకుడిగా కొనసాగుతున్నారు. గతంలో డీఎల్‌డీఏ డైరెక్టర్‌గా, యల్లాయపాళెం సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. యల్లాయపాళెంలోని వారి నివాసంలో ఉంచిన సునీల్‌కుమార్‌రెడ్డి భౌతికకాయాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తికి కాకాణి నివాళి



నెల్లూరు(బారకాసు) : వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నాయకుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతిచెందారు. ఈ క్రమంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఒంగోలులోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

19, 20న డీకేడబ్ల్యూలో వజ్రోత్సవాలు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 19, 20వ తేదీల్లో వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షురాలు జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ప్రముఖులు, పూర్వ విద్యార్థులను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, పోలీసు అధికారులు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

⇨ స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో హిందీ భాష బోధనలో ఏఐ ప్రాధాన్యత అనే అంశంపై అంతర్జాల కార్యశాలను సోమవారం నిర్వహించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జయశంకర్‌బాబు హిందీ బోధనలో ఏఐ ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆత్మారామ్, ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకుడు సురేంద్ర పాల్గొన్నారు.

గందరగోళం మధ్యనే కౌన్సెలింగ్

- ఏఎన్‌ఎంల ప్రమోషన్ల జాబితాలో అప్పటికప్పుడు మార్పులు


కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గందరగోళం మధ్యనే సచివాలయ ఏఎన్‌ఎంల ప్రమోషన్లకు కౌన్సెలింగ్‌ను సోమవారం నిర్వహించారు. లోపాలతో కూడిన మెరిట్ జాబితాను తయారు చేసిన వారినే దగ్గర కూర్చోబెట్టి డీఎంహెచ్‌ఓ సుజాత కౌన్సెలింగ్ నిర్వహించడంతో దళిత సంఘాలు కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశాయి. దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పించలేదని, రోస్టర్ పాయింట్లలో లోపాలు జరిగాయని, అందువల్ల కౌన్సెలింగ్‌ను నిలిపి విచారణ జరపాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా కౌన్సెలింగ్‌ను తాను ఆపేది లేదన్నారు. అయితే అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన సమాచారంతో ఫిర్యాదు చేస్తే విచారించి కారకులైన వారిని సస్పెండ్ చేస్తామని తెలిపారు. కేవలం రెగ్యులర్ సచివాలయ ఏఎన్‌ఎంలకు సంబంధించిన ప్రమోషన్ల జాబితాలో జీఓకు విరుద్ధంగా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను కూడా చేర్చారు. ఈ విషయమై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అప్పటికప్పుడు కాంట్రాక్టు ఏఎన్‌ఎంల పేర్లు తొలగించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే 830 పోస్టులకు సంబంధించి 289 మంది ఏఎన్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించేందుకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రంగడికి అశ్వవాహన సేవ

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి రంగనాథుడికి అశ్వవాహన సేవ నిర్వహించారు. భక్తులు విశేషంగా దర్శించుకుని ప్రణమిల్లారు. స్వామివార్లకు తిరుమంజనం తదితర పూజా కార్యక్రమాలను విశేషంగా జరిపారు. ఉభయకర్తలుగా కిడాంబి వెంకటనరసింహాచార్యుల వారసులు, అట్రవణం కుటుంబం వ్యవహరించింది. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

మనల్ని ఎవడ్రా ఆపేది?

- యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా
- నామమాత్రంగా పోలీసుల చర్యలు



గుంతలోకి చికెన్ వ్యర్థాలను వదులుతున్న లారీ

బుచ్చిరెడ్డిపాళెం: కోవూరు నియోజకవర్గంలో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా విచ్చలవిడిగా తరలిస్తున్నా అధికారుల తనిఖీలు మాత్రం నామమాత్రంగా ఉంటోంది. గత ఐదు నెలల నుంచి ప్రతి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చికెన్ వ్యర్థాల రవాణాను అరికట్టాలని ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారులు మాత్రం పెడచెవిన పెట్టారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో వందలాది ఎకరాల్లో సాగవుతున్న చేపల చెరువులకు అతి తక్కువ ధరకు లభించే చికెన్ వ్యర్థాలను మేతగా వినియోగిస్తున్నారు. ఈ వ్యర్థాల వల్ల వాతావరణంలో కాలుష్యం పెరగడంతో పాటు వ్యర్థాలను తిన్న చేపలు కూడా విషతుల్యతను సంతరించుకుంటున్నాయి.

విషతుల్యంగా మారుతున్న చేపలు

చికెన్ వ్యర్థాల వాడకంతో మూడు నెలలకు పెరగాల్సిన చేపలు నెలన్నరకే పెంచి మార్కెట్లకు తరలిస్తున్నారు. ఇవి సహజ సిద్ధంగా పెరగకపోవడం, విషతుల్యమైన ఆహారాన్ని తినడం వల్ల ఈ చేపల రూపురేఖలే మారిపోతాయి. వీటిని ఆహారంగా తీసుకుంటే పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి..

చికెన్ వ్యర్థాలను తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాల నుంచి జిల్లాకు తరలిస్తున్నారు. బాగా కుళ్లిన స్థితిలో వీటిని తరలించడం వల్ల రోడ్డు వెంబడి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. గత మూడు నెలల నుంచి బర్డ్‌ఫ్లూ సోకడంతో లక్షలాది కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఆ కోళ్ల వ్యర్థాల తరలింపును కొందరు వ్యాపారంగా మలుచుకోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా గత నెలలో వందలాది కంటైనర్లు బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, సంగం మండలాల్లోని చేపల గుంతలకు తరలించారు.

పెన్నా ఒడ్డున వ్యర్థాల కంటైనర్లు

నెల్లూరు రూరల్ మండలం దేవరపాళెం పంచాయతీలోని పెన్నానది ఒడ్డున కంటైనర్లను నిలిపి వాటి నుంచి వివిధ వాహనాల్లో రాత్రి వేళల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. ఈ విషయాలు అధికారులకు తెలిసినా తీసుకున్న చర్యలు శూన్యం.

పోలీసుల పాత్రపై అనుమానాలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో చికెన్ వ్యర్థాల వాహనాలు తిరుగుతున్నప్పటికీ ఏడు నెలల కాలంలో 14 కేసులే నమోదు కావడం పోలీసు పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో గస్తీలు తిరుగుతున్న పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. వారిని పర్యవేక్షించే ఎస్సై సైతం పాత్రధారి కావడం చర్చకు దారితీస్తోంది. ఎస్పీ పర్యవేక్షణ ఉంటే తప్ప వ్యర్థాల సరఫరా నిలిచే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుకున్న వాహనాల్లో కూడా ఒకటో, రెండో వాహనాల వ్యర్థాలను పెన్నానది గుంతల్లో పూడ్చి మిగిలిన వాటిని వదిలివేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.


చికెన్ వ్యర్థాలను ఒక వాహనం నుంచి మరో వాహనానికి తరలిస్తూ..

చికెన్ వ్యర్థాల లారీ పట్టివేత



కొడవలూరు : మండలంలోని తలమంచిలో చేపల గుంతల వద్ద అన్‌లోడ్ చేస్తున్న చికెన్ వ్యర్థాల లారీని ఎస్సై కోటిరెడ్డి సోమవారం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోవూరు నియోజకవర్గంలో చేపల గుంతలకు చికెన్ వ్యర్థాలను ఉపయోగించడాన్ని నిషేధించడం తెల్సిందే. ఈ క్రమంలో చికెన్ వ్యర్థాలతో కాసులు కురిపించుకుంటున్న వ్యాపారులు రాత్రి వేళల్లో వ్యర్థాలను చేపల గుంతలకు తరలిస్తున్నారు. తలమంచిలోని చేపల గుంతలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నట్లు ఎస్సైకు సమాచారం అందడంతో ఆయన సోమవారం వేకువజామున ఘటనా స్థలానికి చేరుకున్నారు. వ్యర్థాలను అన్‌లోడ్ చేస్తున్న సమయంలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రసాయన ఎరువులతో ప్రమాదం


మాట్లాడుతున్న శివన్నారాయణ

ముత్తుకూరు: రసాయన ఎరువులతో పండించిన ఆహార పదార్థాలతో అనారోగ్య సమస్యలొస్తాయని ఆత్మ పీడీ శివన్నారాయణ పేర్కొన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంపై మండలంలోని తాళ్లపూడిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏడీఏ, ముత్తుకూరు మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి, కేవీకే శాస్త్రవేత్త విజయకుమార్, ఎమ్మెఫ్ఎల్ రీజినల్ మేనేజర్ ఆదినారాయణస్వామి, అడిషనల్ మేనేజర్ రాము, వీఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో విఫలం


ప్రజా చైతన్య యాత్రలో సీపీఎం నేతలు

తోటపల్లిగూడూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఇస్కపాళెం పంచాయతీలో సీపీఎం నేతలు, కార్యకర్తలు సోమవారం పర్యటించి ప్రజా సమస్యలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా, ఏ హామీనీ అమలు చేయలేదని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో పేదలు నానా పాట్లు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రూ.22 వేలు పలికిన పుట్టి ధర ప్రస్తుతం రూ.16 వేలకు మించడంలేదని ధ్వజమెత్తారు. రైతులను మిల్లర్లు, దళారులు దగా చేస్తుంటే ప్రభుత్వం మీనమేషాలను లెక్కిస్తోందని మండిపడ్డారు. సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం.. అభివృద్ధి కార్యక్రమాల్లేకపోవడంతో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నేతలు బండి శౌరి, పచ్చా మధు, ఇనమాల కొండయ్య, మోచర్ల రాధయ్య, వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ, కందిపాటి రమణమ్మ, అజ్మ, వీరయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదభరితం


పరిమితికి మించి ఆటోలో ప్రయాణికుల తరలింపు

పొదలకూరు: ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆర్టీసీ బస్సులు గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా.. సమయానికి వెళ్లకపోవడంతో ఇక్కడి వారు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. దీన్నే ఆసరాగా చేసుకొని పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ఈ తరుణంలో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఆటోలను నియంత్రించడం పోలీసుల వల్లా కావడం లేదు.

ప్రిన్సిపల్ నిర్లక్ష్యం.. విద్యార్థుల బేజారు

తోటపల్లిగూడూరు: కోడూరులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యంపై విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలకు చెందిన 79 మంది విద్యార్థినులు చెన్నాపల్లిపాళెం ఉన్నత పాఠశాలలోని కేంద్రంలో పదో తరగతి పరీక్షలను సోమవారం రాశారు. తొలి రోజు కావడంతో పరీక్ష కేంద్రానికి గంట ముందే వెళ్లాల్సి ఉంటుంది. అయితే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థులతో కలిసి పది నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి వెళ్లారు. అయితే అప్పటికే గేట్లేయడంతో లోపలికి వెళ్లేందుకు చీఫ్ సూపరింటెండెంట్‌ను ప్రాధేయపడాల్సి వచ్చింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోకి ఉంచుకొని లోపలికి అనుమతించడంతో పరీక్షలకు విద్యార్థులు హాజరుకాగలిగారు.

డీసీఓ విచారణ

పరీక్షలకు విద్యార్థులను ఆలస్యంగా తీసుకెళ్లి ఇబ్బందులను ఎదుర్కొన్న విషయం తెలుసుకున్న గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ పద్మజ.. కోడూరు గురుకుల పాఠశాలకు సోమవారం సాయంత్రం చేరుకొని విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్ వివరణ కోరారు. కాగా ఈ విషయంలో బాధ్యులను పక్కనబెట్టి నిర్లక్ష్యం వహించారంటూ పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు పీఈటీలను సస్పెండ్ చేశారని సమాచారం.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు: ఎంపీడీఓగా నరసింహారావు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై ఈయన ఉన్నారు. ఈయన స్థానంలో కొడవలూరు ఈఓపీఆర్డీ సాయిప్రసాద్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో రెగ్యులర్ ఎంపీడీఓ నరసింహారావు తిరిగి విధులకు హాజరై బాధ్యతలు స్వీకరించారు.

అర్జీల స్వీకరణ

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖ స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలపై అర్జీలను రైతులు అందజేశారు.

బిరదవోలులో రక్తదాన శిబిరం

పొదలకూరు: బిరదవోలులోని ప్రాథమిక పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బడుగు శ్రీనివాసులు, రెడ్‌క్రాస్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎస్సై హనీఫ్ ప్రారంభించారు. శిబిరాన్ని గ్రామంలో నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

మనుబోలు: మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం రేషన్ డీలర్ చింతల మీనా (26) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. గూడూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటుండగా బీపీ ఎక్కువై గుండెపోటుతో మృతి చెందారని బంధువులు తెలిపారు. ఆమె మృతికి రేషన్ డీలర్ల అసోసియేషన్ మండల నేతలు గోను దశయ్య, షబ్బీర్ సంతాపం తెలిపారు.

యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్) : ఓ యువకుడిపై ఇద్దరు బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఘటన డైకస్‌రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. వెంగళరావ్‌నగర్‌కు చెందిన షారూక్ సోమవారం డైకస్‌రోడ్డుకు వెళ్లారు. మద్యం షాపు మీదుగా వెళ్తుండగా ఆటోలో మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులు 'ఏం రా.. కనిపిస్తే పలకరించవా' అంటూ బీర్‌బాటిల్‌తో అతనిపై దాడి చేశారు.
గాయాలపాలైన షారూక్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. దాడి చేసిన వ్యక్తులు అదే ప్రాంతానికి చెందిన వారని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి



బుచ్చిరెడ్డిపాళెం : మాట్లాడుతున్న సీపీఎం నేతలు


కోవూరు : నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

బుచ్చిరెడ్డిపాళెం : ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ముత్యాల గురునాథం పిలుపునిచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం పార్క్ సెంటర్‌లో ప్రజా చైతన్య యాత్రలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. మిల్లర్లు, దళారులు రైతులను దోచుకుంటున్నారన్నారు. పార్టీ మండల కార్యదర్శి గండవరం శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1,500, విద్యార్థులకు విద్యా దీవెన, రైతు భరోసా హామీలను కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. పవన్ ప్రజా పాలనను గాలికి వదిలేసి బీజేపీ సిద్ధాంతాలను ప్రచారం చేయడం విచారకరమన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, సీపీఎం నాయకులు మల్లికార్జున, తంబి రమణయ్య, శ్రీనివాసులు, మద్దిశెట్టి సురేష్, గరికపాటి సురేష్, జానిబాషా, మునీర్‌అహ్మద్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

➡ కోవూరు : గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నేతలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య మాట్లాడుతూ స్థానిక షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలను చెల్లించాలని, యల్లాయపాళెం రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. పారుదల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పార్టీ నేతలు సర్దార్ అఫ్రోజ్, సురేష్, బాబు, శ్రీనివాసులు, సురేంద్ర, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు, చాన్‌బాషా, ఫాతిమా పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు


వెంకటాచలం: సర్వేపల్లిలోని పరీక్ష కేంద్రం వద్ద హడావుడి


ముత్తుకూరులో..


బుచ్చిరెడ్డిపాళెంలో..


కోవూరు మండల కేంద్రంలో..


కోవూరు : పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు


ఇందుకూరుపేట : నరసాపురంలో..

ముత్తుకూరు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. ముత్తుకూరులోని గురుకుల పాఠశాల, వీబీఆర్, జెడ్పీ హైస్కూల్, పిడతాపోలూరులోని రత్నం హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. కేంద్రాల వద్ద 144వ సెక్షన్‌ను విధించి, పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. 684 మందికి గానూ 675 మంది హాజరయ్యారు.

➡ పొదలకూరు: పొదలకూరులోని డీఎన్నార్ జెడ్పీ బాలబాలికల హైస్కూళ్లు, చైతన్య, మహ్మదాపురం జెడ్పీ హైస్కూల్లో పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 751 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ – 1 రేణుక తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించారు.

➡ వెంకటాచలం: మండలంలోని వెంకటాచలం, సర్వేపల్లి, నిడిగుంటపాళెం, చెముడుగుంట, సరస్వతీనగర్ గ్రామాల్లోని ఏడు కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. 922 మందికి గానూ 914 మంది హాజరయ్యారు.

➡ తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరు, చెన్నపల్లిపాళెం, తోటపల్లిగూడూరులో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 463 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

➡ మనుబోలు: మండలంలోని మనుబోలు జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 219 మందికి గానూ 215 మంది హాజరయ్యారని చీఫ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కాంతారావు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకుడు రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. 144 సెక్షన్‌ను ఎస్సై శివరాకేష్ అమలు చేశారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. మొత్తం 1,146 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని నారాయణ పాఠశాలలో 158 మంది విద్యార్థులకు ఒకరు, రామచంద్రాపురంలోని గురుకుల పాఠశాలలో 261 మందికి, ముగ్గురు, డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో 243 మందికి ఇద్దరు, వివేకానంద హైస్కూల్లో 205 మందికి ముగ్గురు, సెయింట్ థామస్ కళాశాలలో 133 మందికి ముగ్గురు, బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో 119 మందికి ఇద్దరు చొప్పున గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

➡ కోవూరు : మండలంలోని ఐదు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్సై రంగనాథ్‌గౌడ్ తన సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు.

➡ ఇందుకూరుపేట : మండలంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభమైంది. ఇందుకూరుపేట ఎంకేఆర్, ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల, నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 475 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు.

➡ కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం, గండవరం, నార్తురాజుపాళెం, కొడవలూరు, బొడ్డువారిపాళెంలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో సోమవారం జరిగిన పది పరీక్షలకు 476 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం ఐదు కేంద్రాల్లో 488 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 12 మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు.


పొదలకూరులో..


తోటపల్లిగూడూరు: చిన్నచెరుకూరులో..


మనుబోలులో..

పరీక్షలకు 36 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 488 మందికి గానూ 36 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తెలిపారు. ఆరో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులకు గానూ అందరూ హాజరయ్యారని చెప్పారు.

దమ్మాయపాళేనికి కాకాణి రాక నేడు

ముత్తుకూరు: మండలంలోని దమ్మాయపాళేనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఉదయం రానున్నారని పార్టీ స్థానిక నేత దయాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం విక్రయాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు, కష్టనష్టాలను పరిశీలించనున్నారని చెప్పారు.